క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మ కమలం


బ్రహ్మకమలం పుష్పం

రాజాం: పట్టణంలోని కస్పావీధికి చెందిన దోర వేణుకుమారి ఇంటి పెరడులో బ్రహ్మకమలం మొక్కకు ఆదివారం రాత్రి ఓ పుష్పం విరబూసింది. ఏడాదిలో ఒకసారి మాత్రమే ఈ మొక్కకు పుష్పాలు పూస్తాయని, ఈ పుష్పాన్ని చూసేందుకు వచ్చిన స్థానికులు అంటున్నారు.

ఉత్సాహంగా ఆనందోబ్రహ్మ


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

బొబ్బిలి: పట్టణంలోని శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో . యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయమోహన రావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆనందో బ్రహ్మ కార్యక్రమం నిర్వహించారు. నాటికలు, పౌరాణిక,జానపద,పాశ్చాత్య నృత్యాల ప్రదర్శనలో చిన్నారులు,యువతతో పాటు సీనియర్లు కూడా పోటీ పడ్డారు. పట్టణ ప్రజలు, ప్రముఖులు వీక్షించారు.

వెండి కిరీటాల వితరణ


వెండికిరీటాలతో ఉత్సవ మూర్తులు

బొబ్బిలి: స్థానిక తారకరామ కాలనీలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయంలో సీతారామలక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పట్టణానికి చెందిన దాత గొర్లె శంకరరావు వెండి కిరీటాలు వితరణ చేశారు. ఈ కిరీటాలను ఆదివారం మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం ఆలయంలో దాత శంకరరావు దంప తులతో ఆలయ అర్చకులు వేణుగోపాలశర్మ విశేష పూజలు చేయించి, విగ్రహాలకు కిరీటాలను అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక


మహాలక్ష్మి


సుధారాణి

బొబ్బిలి: ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మహాలక్ష్మి, సుధారాణి ఎన్నికయ్యారు.
ఆదివారం ఇక్కడి లోకబంధు రెసిడెన్సీలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా నాలుగో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర నాయకుల సమక్షంలో వీరిద్దరూ జిల్లా కార్యవర్గంలోకి ఎన్నికయ్యారని సంఘ నాయకులు వేదికపై ప్రకటించారు.

అమర వీరుడికి నివాళి


తేజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

సంతకవిటి: మండలంలోని రామారాయపురం గ్రామానికి చెందిన యెన్ని తేజేశ్వరరావు సీఆర్‌పీఎఫ్ జవానుగా విధులు నిర్వర్తిస్తే జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో 2007 ఆగస్టు 16న అమరుడయ్యారు. ఆయన వర్ధంతిని రామారాయపురంలో ఆదివారం నిర్వహించారు. జమ్మూకశ్మీర్ నుంచి వచ్చిన సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారి, పోలీసులు, మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, గ్రామస్తులు తేజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నత్తే నయం..!


బొబ్బిలి జంక్షన్ రోడ్డు వద్ద మూడునెలలుగా సాగుతున్న కల్వర్టు నిర్మాణం

- రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం
- నిధుల విడుదల్లో ప్రభుత్వం మీనమేసాలు
- బిల్లులు అందకపోవడంతో పనుల్లో వేగం పెంచని కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

రాజాం: రాజాం ప్రధాని రహదారి విస్తరణ పనులను అధికారంలోకి వచ్చిన మూడునెలల్లో పూర్తి చేస్తామన్న కూటమి చేతులెత్తేసింది. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఇంతవరకు రహదారి విస్తరణ పనులు పూర్తి కాలేదు. వాస్తవానికి సార్వత్రిక ఎన్నికల ముందే రాజాం ప్రధాన రహదారి రెండో విడత విస్తరణలో భాగంగా ఇటు అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్‌ఐటీ వరకు, అటు బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీకాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా షాపులు,ఇళ్ల తొలగించేశారు. 80 అడుగులు వెడల్పుతో రెండు వైపులా 3,200 మీటర్ల పొడవునా రహదారి విస్తరణ జరగాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో రాజాం వచ్చిన చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే మూడునెలల్లో ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని, ఎన్ని అడ్డంకులు ఉన్నా వాటిని అధిగమిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ అమలుకాకపోగా, పనులు సగంలో ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

గత ప్రభుత్వం వేసిన టోకెన్ల ప్రాప్తికే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండో విడతలో ఈ రోడ్డు విస్తరణకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికల ముందు కాంట్రాక్టర్‌కు ఇచ్చేందుకు రూ.6 కోట్లతో ఒక టోకెన్, రూ.2 కోట్లతో మరో టోకెన్ వేసింది. ఎన్నికలు రావడంతో ఈ బిల్లులు అప్పట్లో విడుదలచేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం వేసిన టోకెన్ల ప్రాప్తికే కాంట్రాక్టర్‌కు బిల్లులు అందాయి. ఆ తర్వాత బిల్లులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్ కొన్నాళ్లు మౌనం వహించారు. ప్రభుత్వంపై ప్రయాణికుల నుంచి విమర్శలు అధికమయ్యాయి.దీంతో స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రోడ్డు విస్తరణ వేగవంతం చేయాలని పట్టుబట్టి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయడంతో సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. కొంతమేర తారు రోడ్డు పూర్తి చేసి, మధ్యలో కల్వర్టుల వద్ద పనులు నిలిచిపోయాయి. అటు బిల్లులు రాకపోవడంతో ఇటు ఈ మధ్యస్తంగా ఉన్న పనుల్లో నిర్లక్ష్యం వహిస్తూ కాలయాపనచేస్తున్నారు. ఫలితంగా వర్షాలు పడితే గుంతల్లో ఉండిపోతున్న నీటితో, ఎండలు ఎక్కువగా ఉంటే దుమ్ము, ధూళితో ప్రయాణికులు, స్థానికులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

అంతా అస్తవ్యస్తం

గత ప్రభుత్వం హయాంలో పైరవీలకు, సిఫిర్సులకు తావివ్వకుండా శ్రీకాకుళం రోడ్డు నుంచి బొబ్బిలి రోడ్డులోని పైడితల్లి అమ్మవారి ఆలయం వరకు రోడ్డు విస్తరణ జరిగింది. ఎక్కడా రోడ్డు మలుపులు, అండర్‌డ్రైనేజీ నిర్మాణంలో వంపులు రాలేదు. డ్రైనేజీ పైకప్పులు ఏర్పాటులో అదనపు వసూళ్లు జరగలేదు. ఇప్పుడు అంతా అందుకు భిన్నంగా కనిపిస్తుంది. పలుచోట్ల రోడ్డు వంకర టింకరగా, మరికొన్నిచోట్ల డ్రైన్‌లు మలుపులు తిరిగాయి. ఈ డ్రైన్‌లపై కప్పులు వేసేందుకు ఆయా షాపులు, ఇళ్ల వద్ద ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు అదనపు వసూళ్లు ఎక్కువయ్యాయి. ఇంకో వైపు సగం తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేసి, మరికొన్నిచోట్ల అధ్వాన్నంగా వదిలేయడంతో ప్రమాదాలు జరగుతున్నాయి. దీంతో అధికారులు తీరును, పాలకుల నిర్లక్ష్య వైఖరిని రాజాం నియోజకవర్గ ప్రజలతో పాటు రాజాం మీదుగా ప్రయాణించే వాహనచోదకులు తప్పుపడుతున్నారు.


దోలపేట జంక్షన్ వద్ద గత ఆరునెలల నుంచి జరుగుతున్న రోడ్డు పని


అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో డ్రైనేజీ నిర్మాణం లేక నిలిచిపోతున్న వరదనీరు


ఏడాదిగా ఇలా నిలిచిపోయిన పనులు

పడిపోయిన వ్యాపారాలు

గత రెండున్నరేళ్లుగా రోడ్డు విస్తరణ కొనసాగుతూ వస్తుండడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు తమ దుకాణాలు మూసేసే పరిస్థితి కనిపిస్తుంది. ఆయా దుకాణాలు, షాపులు, సంస్థల ముందు అండర్ డ్రైనేజ్ కోసం తవ్వేసి వదిలేయడం, నెలలు గడిచినా మూతలు వేయకపోవడం , పలుచోట్ల రోడ్డుపై రాతిపిక్కలు, ఇసుక పోగులుగా ఉండడం, రోడ్డు గుంతలుగా ఉండి ప్రమాదకరంగా మారడంతో షాపులకు కొనుగోలుదారులు రావడంలేదు. ఫలితంగా వ్యాపారాలు పడిపోయి, వ్యాపారులు వేరే ప్రాంతాలు, వేరే వృత్తులు ఎతుక్కోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. మరో ఏడాదైనా ఈ రోడ్డు పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదని వ్యాపారులు వాపోతున్నారు.

ఏఈ ఏమంటున్నారంటే..

రాజాం ప్రధాన రహదారి రెండో విడత విస్తరణ పనుల్లో జాప్యంపై ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావు వద్ద సాక్షి ప్రస్తావించగా రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. బిల్లుల విడుదల్లో జాప్యం కారణంగా ఈ మధ్యలో పనులు నెమ్మదించాయని తెలిపారు. మలుపులు డ్రైన్‌లు, వంకర టింకర రోడ్డు, మధ్యస్త నిర్మాణాలు, కల్వర్టులపై ప్రశ్నించగా మున్సిపల్ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారమే నిర్మాణాలు జరుగుతున్నాయని, కల్వర్టుల నిర్మాణం వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీస్ చేశామని చెప్పారు. మరో రెండునెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు.

పరామర్శ


లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్

రాజాం: అంతకాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నేదుర లక్ష్మయ్య భార్య వరహాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం అంతకాపల్లి వెళ్లి లక్ష్మయ్య, ఆయన కుమారులు రఘు, చిన్నారావును పరామర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, పార్టీ సర్పంచ్‌ల విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, పార్టీ బీసీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, ఎంపీటీసీ కాంతారావు, స్థానిక నాయకులు బిల్లింగి సుందరరావు, నేదుర సోములు, తవుడు, త్రినాథ, వన్నలి మోహనరావు, తిరుపతి, పైడయ్య, వి.దాలప్పడు, దాలిరాజు, పి.ఎస్.మూర్తి, కోట ఆదయ్య తదితరులున్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ చేస్తున్న ఆశ వర్కర్లు

బొబ్బిలి: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో బొబ్బిలిలోని రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి లోకబంధు రెసిడెన్సీ వరకు ఆదివారం భారీ ర్యాలీ చేశారు. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.26వేల వేతనం చెల్లించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని వారంతా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి సుధారాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి. శంకరరావు, రైతుసంఘం జిల్లా నాయకుడు గోపాలం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాతలను అభినందిస్తున్న సీఐ అశోక్‌కుమార్, తదితరులు

రాజాం సిటీ: సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఆయన అభిమానులు స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అపోహలువీడి రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అభిమానులు జి.కొండలరావు, వి.చంద్రశేఖర్, కె.జనార్దనరావు, వి.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, వికాసతరంగిణి రాష్ట్ర సమన్వయకర్త టి.టి.వి.రమణమూర్తి, రోటరీక్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్రవైద్యశిబిరం

రాజాం సిటీ: పట్టణంలోని ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు శిబిరంలో సేవలందిస్తారని పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారంతా తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డుతో హాజరుకావాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించకుండా జీతాల్లో కోతలా..?

- 19న అర్బన్ పీహెచ్‌సీల ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశం


జె.సింహాచలం

రాజాం సిటీ: ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా చిరుద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అర్బన్ పీహెచ్‌సీల ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.సింహాచలం అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 560 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నిరంతరం వైద్యసేవలందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు వేతనాలు పెంచాలని, సౌకర్యాలు కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని తాము కోరుతుంటే...జీతాల్లో కోతలు విధిస్తామంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, సౌకర్యాలు కల్పించకుండా నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. యూపీహెచ్‌సీ ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసిన తర్వాతే ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డిమాండ్ల సాధనతోపాటు సమస్యల పరిష్కారానికి ఈనెల 19న విజయవాడలోని రాఘవయ్య పార్కు వద్ద ఎంబీవీకే భవన్‌లో నిర్వహించనున్న సర్వసభ్యసమావేశానికి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు


రేగిడి: దేవుదల గీతాశ్రమంలో భజన చేస్తున్న భక్తులు


రాజాం: పూజలు అందుకుంటున్న శ్రీకృష్ణ పరమాత్ముడు

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గీతాపారాయణం చేశారు. ఆచార్య ప్రబోధ యోగానంద ఆశీస్సులతో ఈ వేడుకలు జరుగుతున్నాయని కమిటీ వెల్లడించింది. రాజాం పట్టణంతో పాటు పలుగ్రామాలకు చెందిన భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గీతాశ్రమంలో..

రేగిడి: దేవుదల గ్రామంలోని గీతాశ్రమంలో శ్రీకృష్ణ పరమాత్ముడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రానికి చెందిన విశ్వసాయి మందిర భజన బృందం ఆధ్వర్యంలో భజన, గీతాపారాయణం చేశారు.

పరిశ్రమల కాలుష్యంతో ఇక్కట్లు


రామభద్రపురం సమీపంలోని తారు మిక్సింగ్ యూనిట్ నుంచి వెలువడుతున్న కాలుష్యం


గ్రోత్ సెంటర్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలో ఓ పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్యం

బొబ్బిలి: స్థానికగ్రోత్ సెంటర్‌లో పరిశ్రమల కోసం స్థలాలు కేటాయించినప్పటికీ పరిశ్రమల స్థాపన మాత్రం జరగడం లేదు. కానీ ఉన్న కొద్దిపాటి పరిశ్రమల నుంచి కాలుష్యం మాత్రం చాలా ఎక్కువగా వస్తోంది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది అనారోగ్యానికి గురై మంచాన పడుతున్నారు. పోనీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ప్రాంతమంటే అదీ కాదు. మొత్తంగా 325 ప్లాట్లను ఏపీఐఐసీ అధికారులు అభివృద్ధి చేస్తే కేవలం 145 మంది ప్లాట్లను తీసుకున్నారు. ఇందులో ఇప్పుడు వంద లోపు చిన్న తరహా పరిశ్రమలు మాత్రమే వెలిశాయి. అందులోనూ చాలా వరకూ మూతపడ్డాయి. కానీ రోడ్డు అంచున ఉన్న పరిశ్రమలు నిబంధనలను పక్కన పెట్టి తక్కువ ఎత్తులో కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్థానిక గ్రోత్ సెంటర్‌పై దృష్టి సారించి కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నిండుకుండలా పాత చెరువు (ఇన్‌సెట్‌లో) చెరువు గట్టుకు పడిన గండి

- కృష్ణంవలస వద్ద పాత చెరువుకు గండి పడే అవకాశం
- కోతబారిన చెరువు గట్టు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస గ్రామాల మధ్య ఉన్న పాత చెరువు గట్టుకు గండి పడే అవకాశం ఉంది. ఆదివారం కురిసిన కుండపోత వర్షానికి కృష్ణంవలస గ్రామ సమీపంలో చెరువు గట్టు కుంగిపోయి.. కొద్దిపాటి మట్టితో గట్టు నిలబడింది. చెరువు నిండుకుండలా ఉందని, వరద నీరు మరింత చేరితే మొత్తం గట్టు కొట్టేసే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద ఆయకట్టులో దాదాపు 300 ఎకరాల్లో వరి ఉభాలు జరిగాయి. గండిపడితే నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరగా కోతకు గురైన గట్టును పూడ్చాలని కోరుతున్నారు. సమస్యను తహసీల్దార్ బి.సుదర్శనరావు వద్ద సాక్షి ప్రస్తావించగా ..ఇరిగేషన్ అధికారులకు సమాచారమిచ్చామని, యుద్ధ ప్రాతిపదికన గట్టు పునర్నిర్మాణం చేయాలని ఆదేశించామని చెప్పారు.

రోడ్లు ఇలా..ప్రయాణం సాగేదెలా..?


రామభద్రపురం:స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గుంతలమయమైన రోడ్డు


రేగిడి: చెరువును తలపిస్తున్న కొమెర గ్రామ రోడ్డు


రామభద్రపురం: రామభద్రపురం నుంచి బాడంగి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు


రేగిడి: అధ్వానంగా తయారైన అంబకండి- సోమరాజుపేట రోడ్డు


బాడంగి: బాడంగిలో గోతులు తేలిన మెయిన్‌రోడ్డు

రామభద్రపురం/ రేగిడి: రామభద్రపురం, రేగిడి మండలాల్లోని పలుగ్రామాల రోడ్లు గుంతలమయంగా మారాయి. రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రోడ్డు, అలాగే రామభద్రపురం నుంచి బాడంగి వెళ్లే రహదారిలో పెద్దపెద్ద గోతులు తేలాయి.అలాగే రేగిడి మండలంలోని మజ్జిరాముడుపేట, కొమెర, సోమరాజుపేట, ఉంగరాడమెట్ట, వన్నలి, అంబకండి, ఉంగరాడ తదితర గ్రామాల రోడ్లు కూడా గోతులతో దర్శనమిస్తున్నాయి. తాజాగా కురిసిన వర్షాలకు ఈ ఈ రోడ్లలోని గుంతల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి.గోతుల్లో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి బోల్తా పడి వాహనచోదకులు గాయాలపాల వుతున్నారు. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టిరోడ్డే నయం..

బాడంగి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి కంటే మట్టిరోడ్డే నయమని స్థానికులు, ప్రయాణికులు అంటున్నారు. ఈరోడ్డు ఎక్కడికక్కడ గోతులు తేలి శిథిలమై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో సంక్రాంతి పండగకు మరమ్మతులు చేపట్టినప్పటికీ మళ్లీ యథా స్థితికి వచ్చింది. సరిగ్గా బాజార్ మెయిన్ సెంటర్‌లోనే గోతులు ఏర్పడడంతో సాలూరు,రామభద్రపురం నుంచి రాజాంవైపు రాకపోకలు సాగించే వాహన చోదకులు అవస్థలుపడుతున్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు


ఎస్.అగ్రహారం వద్ద కూలిన విద్యుత్ స్తంభం


సంతకవిటిలోని పోలీస్ క్వార్టర్స్‌లో కూలిన చెట్టు

సంతకవిటి: మండలంలో ఆదివారం కురిసిన కుండపోత వర్షానికి పలుగ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో చెట్టు పోలీస్ క్వార్టర్స్‌పై కూలింది. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిలో ఎవరూ ఉండకపోవడంతో ప్రమాదం తప్పింది. జావాంలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకం పంపుహౌస్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్న లైన్‌లో ఎస్.అగ్రహారం వద్ద విద్యుత్ స్తంభం కూలిపోయింది. దీంతో జావాం గ్రామానికి తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు మండలంలో 26.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ బి.సుదర్శనరావు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9951602843
Office mail : vzmadvt@gmail.com